సీఎంఆర్‌ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోవాలి


చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు

కూకట్‌పల్లి: పేదల కోసమే సీఎంఆర్‌ఎఫ్ పథకం అమలవుతుందని, అర్హులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం అల్లాపూర్ డివిజన్‌కు చెందిన మద్దూరి మురళి కృష్ణకు రూ. 2 లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కును లబ్ధిదారుడికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన నిరుపేదలు కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకోవడానికి పథకం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.

10న స్వామివారికి పూజలు, అభిషేకం

మోతీనగర్: గాయత్రినగర్ వెల్ఫేర్ అసోసియేషన్, ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 10న కాలనీలోని గాంధీ విగ్రహం వద్ద వినాయక మండపంలో స్వామి వారికి పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 11 గంటలకు సంకష్ట హర చతుర్థి సందర్భంగా లోక కల్యాణార్థం గాయత్రినగర్ భక్తుల అభ్యున్నతిని కోరుతూ 20 మంది లక్ష్మీగణపతి బ్రాహ్మణ సేవా సమితి వేద పండితుల సమక్షంలో పూజలు, అభిషేకం, హవనం, భజన కార్యక్రమం చేపట్టనున్నట్లు గాయత్రినగర్ వెల్ఫేర్ సంఘం అధ్యక్షులు వేముల కృష్ణారావు, ఉత్సవ కమిటి అధ్యక్షులు నందు కృష్ణారెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పూజల్లో పాల్గొనే దంపతులు ముందుగా రూ.516 చెల్లించి రశీదు పొందాలని తెలిపారు. పూజల్లో పాల్గొన్న దంపతులకు అన్నప్రసాదం ఉంటుందని తెలిపారు.

చంద్రగ్రహణంతో ఆలయాల మూసివేత


మూసివేస్తున్న వేంకటేశ్వర స్వామి ఆలయం

మోతీనగర్: మూసాపేట డివిజన్ పాండురంగ నగర్‌లో దేవదాయ ధర్మాదాయ శాఖ ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని చంద్రగ్రహణం సందర్భంగా ఆదివారం పూజల అనంతరం మూసివేశారు. తిరిగి సోమవారం ఉదయం ఆలయాన్ని సంప్రోక్షణ చేసిన అనంతరం భక్తులకు శ్రీవారి దర్శనం ఉంటుందని ఆలయ కార్యనిర్వహణాధికారి గుమ్మడిదల సుధాకర్ తెలిపారు.

నిమజ్జనం.. వ్యర్థాల తొలగింపు!

- ఐడీఎల్ చెరువులో 16 వేల వినాయక విగ్రహాల నిమజ్జనం
- ప్రస్తుతం అందుబాటులో 4 క్రేన్‌లు
- 6 వేల టన్నుల వ్యర్థాల వెలికితీత


ఆదివారం ఉదయం 8 గంటలకు నిమజ్జనం అవుతున్న గణనాథులు

మూసాపేట: కూకట్‌పల్లి ఐడీఎల్ చెరువులో వినాయక నిమజ్జనాలు ఆదివారం సాయంత్రం వరకు కొనసాగాయి. శనివారం సామూహిక వినాయక నిమజ్జనం జరగగా సాయంత్రం అర్ధరాత్రి తరువాత వినాయక విగ్రహాలు రావటం మొదలయ్యాయి. ఆదివారం ఉదయం 10.30 వరకు వినాయక నిమజ్జనాల కోసం భారీ క్యూ లైన్‌లో వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. సుమారు 7 క్రేన్లతో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు. దూర ప్రాంతాలైన గాజులరామారం, చింతల్, జగద్గిరిగుట్ట, ఆల్విన్‌కాలనీ, నిజాంపేట్, వసంత్‌నగర్, మోతీనగర్, ఎర్రగడ్డల నుంచి వినాయక విగ్రహాలు నిమజ్జనానికి వచ్చాయి. సుమారు 16 వేలకు పైగా విగ్రహాలు నిమజ్జనం అయ్యాయని అధికారులు తెలిపారు. ఆదివారం సాయంత్రం కూడా విగ్రహాలు నిమజ్జనానికి వచ్చాయి. మూడు క్రేన్లు వెళ్లిపోగా, నాలుగు క్రేన్లతో నిమజ్జనాలను చేస్తున్నారు.

6 వేల టన్నుల వ్యర్థాలు తొలగింపు

కూకట్‌పల్లి ఐడీఎల్ చెరువు నుంచి ఆదివారం సాయంత్రం వరకు సుమారు 6 వేల టన్నుల వినాయక విగ్రహాల వ్యర్థాలను తొలగించినట్లు అధికారులు తెలిపారు. మొదటి రోజు నుంచి ఎప్పటికప్పుడు వ్యర్థాలను తొలగించి కైత్లాపూర్‌లోని డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. ఆదివారం ఒక్క రోజే సుమారు 1200 టన్నుల వ్యర్థాలను తొలగించినట్లు అధికారులు తెలిపారు. సుమారు నాలుగు జేసీబీల సహాయంతో వ్యర్థాలను తొలగించి టిప్పర్, లారీల ద్వారా డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. కొలనులో, చెరువులో పనులు జరుగుతున్నాయని, ఇంకా వ్యర్థాలు తీయాల్సి ఉందన్నారు. సోమ, మంగళవారం కూడా పనులు జరగవచ్చని అధికారులు తెలిపారు. కైత్లాపూర్ డంపింగ్ యార్డు వద్ద డంపింగ్ చేసి తర్వాత అక్కడ ఇనుమును వేరు చేసి, ప్లాస్టర్ ఆఫ్ పారిస్, వ్యర్థాలను జవహర్‌నగర్‌లో ఉన్న డంపింగ్ యార్డుకు తరలిస్తారు. త్వరలో బతుకమ్మ పండుగ వస్తుండటంతో చెరువు కట్టపై ఉన్న కొలనులోని వ్యర్థాలను, నీటిని పూర్తిగా తొలగించి, బతుకమ్మ పండుగ వరకు కొత్త నీటిని చేరుస్తామని అధికారులు పేర్కొన్నారు.


నిమజ్జనం కోసం క్యూలో ఉన్న విగ్రహాలు


ఐడీఎల్ చెరువులో వ్యర్థాలను, వినాయక విగ్రహాలను తొలగిస్తున్న జేసీబీలు

ఎన్నికల హామీలను అమలు చేయాలి


పోస్టుకార్డు ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులు

మోతీనగర్: తెలంగాణ ఉద్యమకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని తెలంగాణ ఉద్యమకారులు పోస్టుకార్డు ఉద్యమానికి ఆదివారం శ్రీకారం చుట్టారు. మోతీనగర్ పోస్టాఫీస్ వద్ద తెలంగాణ ఉద్యమకారుల ఆధ్వర్యంలో జూబ్లీహిల్స్, మోతీనగర్‌కు చెందిన ఉద్యమకారులు రాహుల్‌గాంధీకి పోస్టుకార్డు ఉద్యమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మలిదశ సీనియర్ ఉద్యమకారుడు ఇంద్రకుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇచ్చిన హామీలలో ప్రతి ఉద్యమకారుడికి 250 గజాల స్థలం, ప్రతి నెలా 25 వేల పింఛన్, స్వాతంత్ర్య సమరయోధులుగా తెలంగాణ ఉద్యమకారులను గుర్తిస్తూ శాశ్వత గుర్తింపు కార్డును వీలైనంత త్వరలో అందజేయాలని కోరారు. లేకపోతే రాబోయే ఎన్నికల్లో తెలంగాణ ఉద్యమకారుల సత్తా ఏమిటో చూపిస్తామని హెచ్చరించారు. ఎంతోమంది అమరవీరుల త్యాగఫలంతో రాష్ట్రం ఏర్పడిందన్నారు. తెలంగాణ ఉద్యమకారులకు ప్రత్యేక స్థానం కల్పించాలని కోరారు. రాబోయే రోజుల్లో దశలవారీగా ఉద్యమాలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో వీరస్వామి, బ్యాగరి చంద్రశేఖర్, సీహెచ్. నర్సింగ్‌రావు, పద్మ యాదవ్, మాణిక్యం, మోహన్‌చారి, సతీష్ గౌడ్, చిట్టబోయిన నర్సింగ్‌రావు ముదిరాజ్, బి. చంద్రశేఖర్, విష్ణువర్ధన్ రెడ్డి, సంగం సురేందర్ గౌడ్, కొండపల్లి శ్రీలత, నర్సింగ్‌రావు, సత్యనారాయణ గౌడ్, మహమ్మద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

సెలూన్ ప్రారంభించిన హీరోయిన్ మీనాక్షి చౌదరి

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లిలోని పాపారాయుడు నగర్‌లో రోమియో అండ్ జూలియట్ యునిసెక్స్ సెలూన్‌ను ప్రముఖ హీరోయిన్ మీనాక్షి చౌదరి సెలూన్ మేనేజింగ్ డైరెక్టర్ వీరాతో కలిసి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వ్యక్తిగత గ్రూమింగ్ ఆధునిక జీవితంలో ఒక ముఖ్యమైన భాగమన్నారు. అందం, శైలి, విశ్వాసంతో పురుషులు, మహిళలు ఇద్దరికీ ఒకే చోట యూనిసెక్స్ ప్రీమియం గ్రూమింగ్ సేవలను అందించటం గొప్ప విషయమన్నారు. సెలూన్ మేనేజింగ్ డైరెక్టర్ వీరా మాట్లాడుతూ.. ప్రొఫెషనల్ నైపుణ్యం, కస్టమర్ సెంట్రిక్ సేవల ద్వారా అసాధారమైన గ్రూమింగ్ అనుభవాలను నిరంతరం అందించడమే తమ లక్ష్యమన్నారు.


సెలూన్‌ను ప్రారంభిస్తున్న హీరోయిన్ మీనాక్షి చౌదరి, మేనేజింగ్ డైరెక్టర్ వీరా

పేదలకు సహకారం అందించాలి


హోప్ ఆఫ్ హంగర్‌తో కలిసి రుద్రతేజకు వీల్ చైర్‌ను అందజేస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

ఆల్విన్‌కాలనీ: పేదలకు సాయం చేయడానికి స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ అన్నారు. హోప్ ఆఫ్ హంగర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ, పీజేఆర్‌నగర్ బ్లాక్ నెంబర్ 79లో నివసించే యాదగిరి కుమారుడు రుద్రతేజ చిన్నతనం నుంచి పోలియో వ్యాధితో బాధపడుతూ నడవలేని స్థితిలో ఉన్నారు. ఆదివారం రుద్రతేజకు ట్రస్ట్ తరఫున వీల్ చైర్‌ను కార్పొరేటర్ అందజేశారు. సంస్థ వ్యవస్థాపకురాలు అలేఖ్యకు ఆమె బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్. భాస్కర్, వాలి నాగేశ్వరరావు, మజర్, రహీందర్, మహేష్, బషీర్, సుధాకర్, వెంకట్, సావిత్రి, సంస్థ సభ్యులు వెంకటేశ్వరరావు, డి. కృష్ణారావు, రవికిరణ్, మీరయ్య, తదితరులు పాల్గొన్నారు.

పోటాపోటీగా లడ్డూల వేలం

కూకట్‌పల్లి జంట సర్కిళ్ల పరిధిలో వినాయక నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. శనివారం రాత్రి పలు మండపాలలోని వినాయక విగ్రహాలకు పలువురు నాయకులు, అసోసియేషన్ సభ్యులు పూజలు చేసి లడ్డూ వేలం పాడారు. వేలం పోటాపోటీగా సాగింది. పూజల అనంతరం గణనాథులను నిమజ్జనానికి తరలించారు.

– కూకట్‌పల్లి (జోన్‌బృందం)


రాఘవేంద్ర సొసైటీలో.. రూ. 3.06 లక్షలకు దక్కించుకున్న కైలా


అంజయ్యనగర్ యూత్ అసోసియేషన్ లడ్డూను రూ. 3.61 లక్షలకు దక్కించుకున్న బీర్తి రమేష్


లడ్డూను రూ.1.50 లక్షలకు దక్కించుకున్న రమేష్ ఆచారి


ఇంద్రప్రస్థ అపార్టుమెంట్ లడ్డూను రూ.2,71, 501 దక్కించుకున్న భావన యజ్ఞేష్ రావు


ముస్కీపేట, జనతానగర్‌లోని లడ్డూను రూ.2 లక్షలకు దక్కించుకున్న వరకల శ్రీనివాస్


శ్రీ సాయి శివశక్తి యూత్ ఆల్విన్ సొసైటీ లడ్డూను రూ.81 వేలకు దక్కించుకున్న ముస్లిం సద్దాం


దీనబంధు కాలనీలో సిద్ధి వినాయక యూత్ అసోసియేషన్ లడ్డూను దక్కించుకున్న భక్తులు

లీకేజీలతో గోదావరి జలాలు వృథా!

- రెండు నెలలుగా పట్టించుకోని అధికారులు
- నామమాత్రంగా మరమ్మతులు
- మళ్లీ నాలుగు రోజులకే లీకేజీలు

చింతల్: కళ్ల ముందే రెండు నెలలుగా తాగునీరు వృథా అవుతున్న పట్టించుకునే వారు లేరు. వందల కిలో మీటర్ల నుంచి నగరానికి తీసుకువచ్చిన గోదావరి జలాలు హెచ్ఎంటీ జంగల్‌లో కలుస్తున్నాయి. ఒక డీజీఎం ఇద్దరు వివిధ సెక్షన్ల మేనేజర్లు, సుమారు 50 మందికి పైగా తిరిగే షాపూర్ నగర్ రిజర్వాయర్‌లో తాగునీరు ఏరులై పారుతుంది.

రెండు నెలలుగా...

రెండు నెలల క్రితమే ఈ లీకేజీ అరికట్టేందుకు ఓ కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించారు. మరమ్మతులు చేపట్టడంతో మరల నాలుగు రోజులుకే యధావిధిగా లీకేజీ ఏర్పడి తాగునీరు వృథాగా పోతుంది. ఈ లీకేజీ ఏర్పడిన నీటిని ప్రతిరోజు పదుల సంఖ్యలో వాటర్ ట్యాంకర్లు వాటిని నింపుకుంటాయి. వారు కూడా అధికారులకు లీకేజీ విషయమై తెల్పకపోవడంతో సుమారు రెండు నెలల పైగా నీరంతా హెచ్ఎంటీ ఖాళీ ప్రదేశంలోకి వెళ్తుంది. సుమారు 50 నుంచి 60 మంది సిబ్బంది ఎదురుగా నిత్యం నల్ల నుంచి నీరు వృథాగా పోతున్నా ఏ ఒక్కరు కూడా నల్లాను అమర్చే పని చేపట్టకపోవడంతో కొన్ని రోజులుగా 24 గంటల పాటు తాగునీరు వృథాగా పోతుంది. అదేవిధంగా చేసిన పనులకు సైతం కాంట్రాక్టర్లకు బిల్లులు నమోదు చేయకపోవడంతో సుమారు ఏడాదికి పైగా అవి రికార్డులు కూడా రాయలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.


షాపూర్‌నగర్ 900 కేఎల్ రిజర్వాయర్ వద్ద రెండు నెలలుగా వృథాగా పోతున్న నీరు

దీంతో సదరు కాంట్రాక్టర్లు కూడా ఒక నల్లని కూడా ఏర్పాటు చేయలేకపోతున్నారు అన్న ఆరోపణ వినిపిస్తోంది.

వాటర్ ఫౌంటెన్‌ను తలపిస్తూ..

కూకట్‌పల్లి బాలానగర్‌కు చెందిన రిజర్వాయర్ షాపూర్‌నగర్ రిజర్వాయర్ ఆవరణలో సెవెన్ ఎం.ఎల్ కెపాసిటీతో నిర్మించిన విషయం తెలిసింది. షాపూర్ నగర్ నుంచి వెళ్లే 600 భారీ పైపులైన్ బాలానగర్‌కు వెళ్తుంది. ఆదివారం మధ్యాహ్నం హెచ్ఏఎల్ గేట్ నెంబర్ వన్, గేట్ నెంబర్ 2 మధ్యలో ఉన్న ఎయిర్ వాల్వ్ అకస్మాత్తుగా పేలిపోయింది. దీంతో అప్పటికే నీటి సరఫరా కొనసాగుతుండగా.. ఈ నీరు సుమారు 20 మీటర్ల ఎత్తులో పైకి ఎగిసిపడి వాటర్ ఫౌంటెన్‌ను తలపించింది. ఈ పైపులైన్ బాలానగర్‌లోని హెచ్ఏఎల్ ఎన్ఆర్ఐసీ తదితర ప్రభుత్వ విభాగాలకు వెళ్తుంది. కిలో మీటర్ మేర పారడంతో పాటు హెచ్ఐఎల్ రెండవ గేటు లోపలికి కూడా నీరు ఏరులై పారింది. దీంతో హెచ్ఐఎల్ సిబ్బంది షాపూర్‌నగర్ వెళ్లి ప్రధాన పైపులైన్‌ను బంద్ చేయడంతో నీటి సరఫరా నిలిచిపోయింది.


బాలానగర్ వెళ్లే దారిలో ఫౌంటెన్‌ను తలపించిన గోదావరి జలాలు


హెచ్ఏఎల్ గేటు లోపల పారుతున్న గోదావరి నీరు


షాపూర్‌నగర్ రిజర్వాయర్ వద్ద సిబ్బంది ఉపయోగించే నల్లా వద్ద 24 గంటలు పారుతున్న నీరు

సత్తా చాటిన విద్యార్థులు



కూకట్‌పల్లి: ఆల్విన్‌కాలనీలోని బాలకృష్ణ హైస్కూల్‌లో ఆదివారం పైల్వాన్ క్లబ్ స్టేట్ లెవెల్ ఇంటర్ స్కూల్ ఛాంపియన్‌షిప్ 2025–26 అండర్ 10 విభాగం పోటీలు నిర్వమించారు. ఈ పోటీల్లో ఆదిత్యనగర్‌లోని రవీంద్ర భారతి పాఠశాల విద్యార్థులు పాల్గొని విజేతలుగా నిలిచారు. చెస్‌లో మొదటి బహుమతి చైత్రేశ్, పరుగుపందెంలో ద్వితీయ బహుమతి రిహాన్, పరుగు పందెం తృతీయ బహుమతి దీపా విజేతలుగా నిలిచారు. వీరిని పాఠశాల నిర్వాహకులు అభినందించారు.

మహిళలు పొదుపు సంఘాల్లో చేరాలి

సుభాష్‌నగర్: మహిళలు స్వతంత్రంగా తమ కాళ్లపై తాము నిలబడాలంటే అర్హులైన ప్రతి మహిళ పొదుపు సంఘాల్లో చేరాలని బాలయ్య నగర్ అధ్యక్షుడు నాగేష్ అన్నారు. ఆదివారం కొత్త గ్రూపులపై మహిళలకు అవగాహన కల్పించారు. బాలయ్య నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగేష్, మహిళ సంఘం అధ్యక్షురాలు పార్వతి, ఆర్పీ ధనలక్ష్మి మాట్లాడారు. గతంలో 16 గ్రూపులు ఉండగా, ఆరు నెలల వ్యవధిలో 25 గ్రూపులను తయారు చేశామన్నారు. మొత్తం 50 గ్రూపుల ఏర్పాటు లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు.

యూత్ కాంగ్రెస్ సోషల్ మీడియా కో ఆర్డినేటర్‌గా వినోద్‌కుమార్

ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి నియోజకవర్గం వివేకానందనగర్ డివిజన్ యూత్ కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా వెంకటేశ్వర్ నగర్, పోచమ్మ బస్తీకి చెందిన వినోద్‌కుమార్‌ను నియమించారు. ఆదివారం పీఏసీ చైర్మన్ గాంధీ ఆయనను సన్మానించారు. పార్టీ పథకాలను సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేయాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షురాలు విద్యాకల్పన, నియోజకవర్గ మహిళా కాంగ్రెస్ కార్యవర్గ సభ్యురాలు శాలిని, జితేందర్, డివిజన్ నాయకుడు బొట్టు శ్రీను, అంబికా తదితరులు పాల్గొన్నారు.


సన్మానిస్తున్న పీఏసీ చైర్మన్ గాంధీ తదితరులు

అర్హులకు ఇందిరమ్మ ఇళ్లను కేటాయించాలి


హమాలీల సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మణ్

కుత్బుల్లాపూర్: అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని, లేని పక్షంలో ప్రభుత్వ స్థలాలు, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను ఆక్రమిస్తామని సీపీఎం మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ అన్నారు. ఆదివారం సీఐటీయూ కుత్బుల్లాపూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో షాపూర్‌నగర్ కార్యాలయంలో పారిశ్రామిక ప్రాంత లోడింగ్, అన్‌లోడింగ్ హమాలీ కార్మికుల జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో 60 లక్షల మంది అసంఘటితరంగ కార్మికులు ఎలాంటి చట్టాలు, హక్కులు లేకుండా పని చేస్తున్నారని, వారికి కనీసం ఉండడానికి ఇళ్లు లేక వేల రూపాయలు అద్దెలు చెల్లిస్తున్నారన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు వారికి అందడం లేదన్నారు. సొంత ఇళ్ల కోసం దరఖాస్తులు చేసుకున్నా ఏళ్ల తరబడి ఎదురు చూపులు తప్పడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా 18 వేల డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఎవరికి కేటాయించకపోవడంతో ఖాళీగా ఉన్నాయని, వాటిని వెంటనే పేద ప్రజలకు అప్పగించాలన్నారు. ప్రభుత్వం స్పందించకుంటే సీపీఎం ఆధ్వర్యంలో నిరుపేదలకు అప్పగిస్తామన్నారు.